ప్రజాశక్తి

మంగళవారం 3 జనవరి 2023



జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తమిళనాడు రాష్ట్రం నాగర్ కోయిల్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండ వెలగాడ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. 40 కేజీల విభాగంలో బెల్లాన భార్గవి కాంస్య పతకం, 45 కేజీల విభాగంలో వల్లూరి సుస్మిత రజత పతకం, 55 కేజీల విభాగంలో తలచుట్ల లావణ్య కాంస్య పతకం, 59కేజీల విభాగంలో బెల్లాన హారిక కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, ఎంపిటిసి మొయిద కళావతి, గ్రామపెద్దలు మొయిద అక్కోజీ, కోచ్ బి.రవిని క్రీడాకారులను అభినందించారు.



సాధించిన పతకాలతో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు



కల్లంలో ఉన్న ధాన్యం బస్తాలు

రైతులను దోచేస్తున్నారు!

తేమ శాతంలో గోల్‌మాల్

అదనపు ధాన్యం తీసుకుంటున్న మిల్లర్లు

కళాసీ ఛార్జీలలో అక్రమాలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలోనూ రైతులకు పాట్లు తప్పడం లేదు. ధాన్యం రైతులను మిల్లర్లు నిలువునా దోచేస్తున్నారు. తేమ శాతంలో మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. రైతులు అదనంగా ధాన్యం ఇస్తేనే రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకెళ్తున్న ధాన్యాన్ని మిల్లర్లు తీసుకుంటున్నారు. మరోవైపు కళాసీ ఛార్జీల్లోనూ మిల్లర్లు కక్కుర్తి పడుతున్నారు. రైతుల నుంచి బస్తాకు రూ.5 వసూలు చేసి, కళాసీలకు రూ.3.36 మాత్రమే ఇస్తూ దోపిడీ చేస్తున్నారు.

ప్రజాశక్తి-బొబ్బిలి

రైతు భరోసా కేంద్రాలలో 16 శాతం తేమ శాతం వస్తే మిల్లర్లు 20 శాతం చూపించి అదనంగా ధాన్యాన్ని తీసుకుంటున్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో తేమ శాతాన్ని చూసిన తర్వాత రైసుమిల్లులకు ధాన్యాన్ని పంపిస్తే, అవే ధాన్యానికి తేమలో తేడా వస్తుంది. మిల్లర్లు తేమ శాతం పరీక్షించగా రైతు భరోసా కేంద్రం కంటే మిల్లర్ల వద్ద మరో మూడు శాతం తేమ ఎక్కువ చూపిస్తుంది. దీంతో రైతులు క్వింటాకు 5 నుంచి 8 కిలోలు అదనంగా ధాన్యం ఇస్తేనే మిల్లర్లు తీసుకుంటున్నారు. గత్యంతరం లేక రైతులు అదనంగా ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తున్నారు.

కళాసీ ఛార్జీల వసూలు

కళాసీ ఛార్జీలలో మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. మిల్లుల వద్ద వాహనాల నుంచి ధాన్యం అన్‌లోడింగ్ చేసేందుకు రైతుల నుంచి బస్తాకు కళాసీ ఛార్జి పేరుతో రూ.5 వసూలు చేస్తున్నారు. కళాసీలకు రూ.3.36 చెల్లించి, మిగిలిన డబ్బులను మిల్లర్లు మింగేస్తున్నారు. రైతుల నుంచి వసూలు చేస్తున్న మొత్తం డబ్బులు కళాసీలకు చెల్లించాల్సి ఉన్నా ఎక్కడా చెల్లించడం లేదు. కళాసీలకు ఎంత ఇస్తున్నారో అంత డబ్బులు మాత్రమే వసూలు చేయాల్సిన మిల్లర్లు అదనంగా ఎందుకు వసూలు చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

కళాసీల సమ్మె

రైసుమిల్లుల్లో పనిచేసే కళాసీలకు వేతనాలు పెంచేందుకు మిల్లర్లు ముందుకు రావడం లేదు. రైతుల నుంచి బస్తాకు రూ.5 వసూలు చేస్తున్న మిల్లర్లు మాత్రం కళాసీలకు వేతనాలు పెంచడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచకపోవడంతో కళాసీలు ఆదివారం నుంచి సమ్మెబాట పట్టారు. కళాసీలు సమ్మెలో ఉండడంతో ధాన్యం కొనుగోలు నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతు నుంచి తీసుకుని కళాసీలకు ఇవ్వడం లేదు

వ్యవసాయం, కళాసీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ధాన్యాన్ని రైసుమిల్లుకు తరలిస్తే బస్తాకు రూ.5 వసూలు చేస్తున్నారు. కళాసీ పని చేసుకుని రైతులు తెచ్చిన ధాన్యాన్ని దించితే రూ.3.36 మాత్రమే ఇస్తున్నారు. పెరుగుతున్న ధరలతో మేము ఎలా బతికేది? పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలి.

- పైల రామకృష్ణ, గొల్లపల్లి

కళాసీల సమ్మెకు సిఐటియు మద్దతు

నూతన వేతన ఒప్పందం చేయాలని కళాసీలు చేస్తున్న సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా కళాసీల వేతనాలు పెంచేందుకు వ్యాపారులు, మిల్లర్లు ముందుకు రాకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

చర్చలు విఫలం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

వేతన ఒప్పందంపై రైస్ మిల్లర్లు, కళాసీ సంఘం మధ్య జరిగిన వేతన ఒప్పంద చర్చలు విఫలమయ్యాయి. తహశీల్దార్ రాజారావు సమక్షంలో సోమవారం చర్చలు జరిగాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాత వేతన ఒప్పందంపై 30 శాతం పెంచాలని పట్టణ కళాసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.అప్పలస్వామి, డి.వర్మ డిమాండ్ చేశారు. 26శాతం వేతనం పెంచి మూడేళ్ల అగ్రిమెంట్ చేసుకోవాలని మిల్లర్లు కోరారు. 26 శాతం వేతనాలు పెంచి రెండేళ్ల ఒప్పందం చేయాలని కళాసీలు కోరగా, మూడేళ్ల ఒప్పందానికి మిల్లర్లు పట్టుబట్టారు. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి. వేతన ఒప్పందం చేయకపోతే లోడింగ్, అన్ లోడింగ్ అడ్డుకుంటామని కళాసీలు హెచ్చరించారు. చర్చల్లో సిఎస్ డిటి సాయికృష్ణ, కళాసీ సంఘం న్యాయ సలహాదారు ఎం.జగన్నాథం ఉన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

ఆర్థిక పరిస్థితి బాగోలేదు

- ప్రాజెక్టులు, వంతెనలు నిర్మించలేకపోతున్నాం
- నూతన పింఛన్ల పంపిణీలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

ప్రజాశక్తి- మెంటాడ

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడం వల్లే వంతెనలు, ప్రాజెక్టులు నిర్మించలేకపోతున్నామని ఉప ముఖ్యమంత్రి పి.రాజన్నదొర తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న గుర్ల రిజర్వాయర్, జగన్నాథపురం, ఆగూరు వంతెనలు నిర్మాణం కోసం సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లానని, ఆర్థిక పరిస్థితి బాగోలేక ముందుగా సాగలేక పోయామని చెప్పారు. సంక్షేమ పథకాలు అందకపోతే ఆందోళన పడొద్దని, అనుకున్న వెంటనే పనులు జరిగిపోవని తెలిపారు. తన మాతృమూర్తి వయస్సు ఏడేళ్లుగా ఆధార్‌లో నమోదైందని, మార్చడానికి ఆరేళ్లు పట్టిందని చెప్పుకొచ్చారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు ఆర్నెల్లకు ముందు పింఛను మొత్తాన్ని రూ.2 వేలకు పెంచిన చంద్రబాబు గొప్పలకు పోతున్నారని చెప్పారు. చంద్రన్న కానుకలు ఇస్తామని మాయమాటలు చెప్పి టిడిపి సమావేశాలకు జనాలను తరలిస్తున్నారని ఆరోపించారు. టిడిపి ప్రభంజనమని చెప్పుకునేందుకు ఇరుకు రోడ్లలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని, అందుకే ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ దఫా ఎన్నికలు టిడిపి, వైసిపికి కాదని, పెత్తందారులు, పెట్టుబడిదారులకు, పేదల ప్రభుత్వానికి మధ్య జరగనున్నాయని చెప్పారు.

ఎంపిడిఒ కార్యాలయం మూత

పింఛను కానుక సమావేశం కోసం ఎంపిడిఒ కార్యాలయం మూసివేశారు. ముఖద్వారం ముందు వేదిక ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం జరిగే సభకు ఉదయం నుంచే హడావుడి, వేదిక ఏర్పాట్లు జరిగాయి. దీంతో లోపలికి వెళ్లేందుకు వీలులేక స్పందన అర్జీదారులు వెనుతిరిగారు. ఎంపిడిఒ కార్యాలయం మూసివేసి అర్జీదారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు పేర్కొన్నారు. గతంలో మాదిరిగా ఆరుబయట సమావేశాలు నిర్వహిస్తే బాగుండేదన్నారు. సమావేశానికి వస్తేనే పింఛన్లు ఇస్తామని, లేదంటే రాదని చెప్పి పింఛనుదారులను తరలించినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

నేటి నుంచి పింఛన్ల వారోత్సవాలు

జిల్లాలో 2.83 లక్షలకు పెరిగిన పింఛనుదారులు

ప్రజాశక్తి-విజయనగరం

అవ్వాతాతలకు ఆర్థిక సాయం పెంపు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఇతర వర్గాల వారికి కొత్త పింఛన్ల మంజూరు నేపథ్యంలో జిల్లాలో పింఛను వారోత్సవాలు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాజమండ్రి వేదికగా రాష్ట్ర వ్యాప్త కార్యక్రమం ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లాస్థాయి వారోత్సవాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యానారాయణ గంట్యాడ మండలం కొటారుబిల్లి వేదికగా ఈ వారోత్సవాలను ప్రారంభించనున్నారు. ఈనెల 1 నుంచి పింఛనును రూ.2500 నుంచి రూ.2750కు పెంచిన విషయం తెలిసిందే. మెరకముడిదాంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారిల చేతుల మీదుగా పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేసి కొత్త పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

కొత్తవి 8,999.. మొత్తం 2.83 లక్షలు

జిల్లాలో కొత్తగా 8,999 మంది లబ్ధిదారులకు కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయి. అందులో అధికంగా 3,586 మంది వితంతువులు ఉన్నారు. తర్వాత స్థానంలో 3,438 మంది అవ్వాతాతలు ఉండగా, మూడో స్థానంలో విభిన్న ప్రతిభావంతులు 1,242 మంది ఉన్నారు. డప్పు కళాకారులు 255 మంది, కల్లుగీత కార్మికులు 198, చర్మకారులు 117, మత్స్యకారులు 102 మంది చొప్పున కొత్త పింఛన్లకు ఎంపికయ్యారు. 48 మంది ఒంటరి మహిళలతో పాటు, 12 మంది నేత కార్మికులు, ఒక హిజ్రా కూడా కొత్త పింఛన్లకు ఎంపిక కావటం గమనార్హం. జిల్లాలో పెరిగిన 8,999 కొత్త పింఛన్లతో లబ్ధిదారుల సంఖ్య 2,83.098 మందికి చేరింది.

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు గంట్యాడ మండలం కొటారుబిల్లి జంక్షన్ వద్ద పింఛన్లు అందజేసే నిమిత్తం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు కలెక్టరేట్ వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణలో పాల్గొంటారు. 4.30 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్లనున్నారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కీచకులు

చిన్నారులు, మతిస్థిమితం లేని వారితోపాటు వృద్ధులపై కామాంధులు మద్యం మత్తులో లైంగికదాడులకు పాల్పడుతున్నారు. తాజాగా మండల కేంద్రానికి కూత వేటు దూరంలోగల కిమ్మి గ్రామంలో నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన కామాంధుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. ఈఘటనతో మండల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మండలంలో తరచూ ఇటువంటి ఘటనలు జరగడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వరుస ఘటనలతో తల్లిదండ్రుల ఆందోళన

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలిక ఆదివారం సాయంత్రం గ్రామ సమీపంలో గల నాగావళి నది ఒడ్డుకు బహిర్భూమి కోసం వెళ్లింది. అదే గ్రామానికి చెందిన గురాన గౌరు నాయుడు (50) మార్గమధ్యలో కాపుకాసి మాయ మాటలు చెప్పి శ్మశాన వాటిక పరిసరాల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. అస్వస్థతకు గురైన బాలికను చికిత్స కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా దిశ సెల్ డిఎస్‌పి హర్షిత, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆసుపత్రికి చేరుకొని బాలిక ఆరోగ్యంపై ఆరా తీశారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. సమగ్ర శిక్షాభియాన్ ఎఎంఒ రాజేశ్వరి, ఎంఇఒ సిహెచ్.రత్నాకర్ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థినితో మాట్లాడారు. అనంతరం పాఠశాల, బాధితురాలి ఇంటికి వెళ్లి ఆరా తీశారు. గౌరునాయుడుకు భార్య ఉంది. పిల్లలు లేరు. చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. గ్రామంలో మద్యంతో పాటు నాటుసారా ఏరులై పారుతోంది. దీంతో రోజూ మద్యం తాగుతూ జులాయిగా తాగుతున్నాడు. ఈనేపథ్యంలోనే బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

గత ఏడాది డిసెంబరు 13న వీరఘట్టం మండల కేంద్రంలోని పాత పోస్టాఫీసు వద్ద మతిస్థిమితం లేని మహిళపై కామాంధులు మద్యం మత్తులో లైంగిక దాడి చేశారు. అప్పట్లో పోలీసులు స్పందించి లైంగిక దాడికి గురైన మహిళను వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీసుకువెళ్లి చికిత్స అందించి అనంతరం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని హోంకేర్‌కు తరలించారు. ఇదే మండలం 2021 నవంబర్ 4న నడుకూరు గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక దాడి చేశాడు. మండలంలో వరుస బాలికలపై లైంగిక దాడులు చేయడంతో పిల్లల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

స్పందనకు 106 వినతులు

సచివాలయ సిబ్బందికి శాఖాధిపతుల నియంత్రణ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 106 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 69 ఉన్నాయి. డిఆర్‌డిఎకు 13, హౌసింగ్‌కు 6, మున్సిపల్ శాఖకు 6, వైద్య శాఖకు 5, పంచాయతీరాజ్‌కు 7 చొప్పున వినతులు అందాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సచివాలయ సిబ్బందికి శాఖాధిపతుల నియంత్రణ

స్పందన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇకపై ఎంపిడిఒ లేదా మున్సిపల్ కమిషనర్ల నియంత్రణలో పని చేయవలసి ఉంటుందని తెలిపారు. శాఖల మధ్య సమన్వయం కొరవడకుండా ఉండేందుకు సచివాలయ సిబ్బందిని హెచ్ఒడిలు నియంత్రించాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ లు, విఆర్ఒలు, సర్వేయర్‌లు, ఇంజినీరింగ్ సహాయకులకు ఒడిలు వేస్తే కాపీని తప్పనిసరిగా సిపిఒకు మార్క్ చేయాలన్నారు. ఎవరిని డిడిఒలుగా నియమించాలనేది ఎంపిడిఒ చూడాలన్నారు. ఆ మేరకు త్వరలో సర్క్యులర్ వ్వనున్నట్లు తెలిపారు.



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

జిల్లా పోలీసు కార్యాలయంలో...

జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు నిర్వహించారు. పలువురి నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. సిఐలు జె.మురళి, ఎస్ఐ వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యా ప్రదాత సావిత్రీబాయి పూలే

జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సావిత్రిబాయి పూలే జయంతి సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో కనపాక నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి సమతా జిల్లా కన్వీనర్ జి. నిర్మల , ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ మాట్లాడుతూ దేశంలో మహిళలకు విద్య నేర్పేందుకు కృషి చేసిన తొలి గురువు సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. మహిళల వివక్షతకు వ్యతిరేకంగా సావిత్రీ బాయి పూలే పోరాడారని అన్నారు. దళితులు, బలహీన వర్గాల మహిళాల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. ఆమె స్ఫూర్తితో మహిళల సమస్యలపై ఐద్వా పోరాడుతోందని అన్నారు. మూఢ నమ్మకాలు, వివక్ష, అత్యాచారాలకు, అవిద్యకు వ్యతిరేకంగా నేటి తరం పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం : సావిత్రిబాయి పూలే జయింతి వేడుకలు గజపతినగరం మండలం మరుపల్లిలో పాఠశాలలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి పాల్గొని ప్రసంగించారు. సావిత్రిబాయి పూల స్త్రీ విద్యను ప్రోత్సహించారని తెలిపారు. అనేక మూఢచారాలకు వ్యతిరేకంగా పోరాడారని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని విద్యలో చదువులో రాణించాలని విద్యార్థినులకు సూచించారు.



సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా, జెవివి సమత సభ్యులు



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న జనం

వైభవంగా గిరి ప్రదర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామస్వామి దేవస్థానంలో భక్తులు తెల్ల వారు జాము నుంచి సీతారాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన గిరి ప్రదర్శనలో వేలాది మంది పాల్గొన్నారు. దేవస్థానం ప్రధానార్చకులు ఖండవిల్లి సాయిరామా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు గొడవర్తి రామ నరసింహాచార్యులు, ఖండవిల్లి కిరణ్, పాణంగి పల్లి ప్రసాద్, పవణ్ కుమార్ స్వామి వారి ఆరాధన, తిరుప్పావై సేవా కాలం, మంగళా శాసనం, తీర్థ గోష్ఠి జరిపించారు. భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించి తిరు వీధి ఉత్సవం ముగింపు పలికారు. కొదండ రామస్వామి మెట్ల దారిలో మెట్ల వద్ద పూజలు జరిపి మెట్లో త్సవంతో బాటు గోపూజ నిర్వహించారు. కాగా కోదండ రామస్వామి ఆలయం చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. ఉత్సవ ఏర్పాట్లు దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి. ప్రసాద్ పర్యవేక్షించారు.

కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సాధు పరిషత్ శ్రీనివాసానంద, డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి సన్యాసినాయుడు, రామారావు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

సిటియు విసి కట్టమణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ టివి కట్టిమని అన్నారు. హెచ్ఐవి,ఎయిడ్స్‌పై సమాజంలో చైతన్యం కలిగించడం ద్వారా మాత్రమే నియంత్రించవచ్చునని అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమం లో కట్టిమని మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే ఎయిడ్స్ నియంత్రణకు సంభందించిన పలు అంశాలను రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ గైడ్స్ ద్వారా తెలియజేయాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల అధ్యక్షులు డాక్టర్ కె.పద్మ లీల రిసోర్స్ పర్సన్‌గా హెచ్ఐవి వచ్చినట్లు అనుమానం వస్తే దగ్గరలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలని అనంతరం డాక్టర్లు నిర్దేశించిన ప్రకారం మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం నాగేష్, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ ప్రేమే చట్టర్జీ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 3 నుంచి 6 వరకు అమృత్‌సర్‌లోని గురునాయక్ దేవ్ యూనివర్సిటీలో జరుగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన ఎన్. హరికృష్ణ , ఎం.గగన్ సాగర్ , వై.భార్గవి సోమవారం బయలుదేరి వెళ్లారు. వీరికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు , సిహెచ్ వేణుగోపాలరావు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

ఎంఆర్ లా కళాశాలను కొనసాగించాలి

పిపిఎస్ఎస్ జిల్లా కార్యదర్శి శంకర్రావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో గల ఏకైక ఎంఆర్ లా కాలేజీని కొన సాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర రావు డిమాండ్ చేశారు. సోమ వారం ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లా కాలేజీని ఎత్తి వేసేందుకు ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే 2023లో జరుగుతున్న అడ్మిషన్‌ల కళాశాల ఆప్షన్ జాబితా నుంచి ఎంఆర్ లా కళాశాల పేరును తొలగించారని అన్నారు. దీనివల్ల ఈ ఏడాది జాయిన్ కావలసిన విద్యార్థులు లా చదువుకునే అవకాశం కోల్పోయారని అన్నారు. వచ్చే ఏడాది నుంచి లా కళాశాలను ఎత్తివేసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. విద్యల నగరంగా పేరు గాంచిన విజయనగరం జిల్లా పేరును భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. కళాశాలను కొనసాగించే విధంగా ప్రభుత్వం, జిల్లాకు చెందిన విద్యాశాఖామంత్రి బొత్స సత్యన్నారాయణ, మాన్సాస్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఈనెల 3 నుంచి 6 వరకూ స్థానిక ఎమ్మెల్యే, జెడ్‌పి చైర్మన్, విద్యాశాఖామంత్రి, కలెక్టర్‌కు వినతులు అందజేస్తామని, 7 న ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సమస్య పరిష్కారం చేయక పోతే ప్రజా ఉద్యమం చే పడతామన్నారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు వి.రామచంద్రరావు, త్రినాథ్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభం

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్లు : జెసి

ప్రజాశక్తి-విజయనగరం

రేషన్ కార్డులపై ఇప్పటివరకు కిలో రూ.1 చొప్పున అందిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని జనవరి నుంచి లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. జిల్లాలో ఉచిత బియ్యం పంపిణీ ఇప్పటికే ప్రారంభమయ్యిందని చెప్పారు. ఎప్పటిలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న 370 ఎండియు వాహనాల ద్వారా, లబ్ధిదారుల ఇళ్లవద్దకే తీసుకువెళ్లి, ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బియ్యం తీసుకొనేటప్పుడు, ఎండియు వాహనదారుడికి, పండగ మామూలు, లేదా ఇతరత్రా రూపేణా ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, అలా వసూలు చేసివారిపై కఠిన చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు. రేషన్ బియ్యాన్ని ఎవరికైనా విక్రయించినా, ప్రక్కదారిపట్టించినా చట్టప్రకారం నేరమని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ సరఫరా చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని లబ్ధిదారులు తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. బియ్యం సరఫరాకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే, కాల్ సెంటర్ 1967, టోల్ ఫ్రీ నెంబరు 18004250082 నెంబర్లకు ఫోన్ చేయవచ్చుని సూచించారు. సంక్రాంతి పండగను దృష్టిలో ఉంచుకొని ఈ నెలలో అరకిలో పంచదార రూ.17కు, కిలో కందిపప్పు రూ.67 చొప్పున కార్డు దారులందరికీ సరఫరా చేస్తామన్నారు.

చంద్రబాబు దుష్ప్రచారం నమ్మొద్దు

నూతన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు




జామి.. పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జామి

చంద్రబాబు దుష్ప్రచారం నమ్మొద్దని, పేదల పక్షపాతి జగన్మోహన్ రెడ్డిని మరవద్దని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 182 నూతన పెన్షన్లను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే ఏడాదికి రూ.3 వేలు పింఛను మొత్తాన్ని అందిస్తామని చెప్పారు. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల ద్వారా ఎన్ని అరాచకాలు చేశారో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. సిఎం జగన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేని చంద్రబాబు, వారి దుష్టచతుష్టయం ప్రభుత్వంపైన బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, అలమండ సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ గుడివాడ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అలమండలో గడపగడపకు..

మండలంలోని అలమండ - 1 సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, అలమండ సూరిబాబురాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, వైస్ సర్పంచ్ లగుడు దేముడు, బండారు వెంకటరావు, వై.అప్పలనాయుడు, ఆచారి, పి.ఆనంద్, బండారు రామక్రిష్ణ, కిల్లి నాయుడుబాబు, భీలా వెంకటరావు, కాకర్ల చిన బాబు, రామయ్య పాలెం సత్యం, లగుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.




వేపాడ.. పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి సత్యవంతుడు

అవ్వ తాతలకు ఘనమైన కానుక: ఎమ్మెల్యే

డెంకాడ : అవ్వ తాతలకు ఘనమైన కానుకను ప్రభుత్వం పింఛను రూపంలో అందించిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతనంగా మంజూరైన 292 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సామాజిక పించన దారులకు సంక్రాంతి పండుగ ముందే వచ్చేసిందన్నారు. పింఛను రూ.250 పెంచి వితంతువులు, అవ్వతాతలకు ప్రభుత్వం ఘనమైన కానుక అందించిందన్నారు. అర్హత ప్రమాణికంగా పింఛన్ అందిస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, జెడ్‌పిటిసి బడ్డుకొండ లక్ష్మి, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నాయకులుపాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ



డెంకాడ.. పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

వేపాడ : మండలంలో కుంపల్లి, కృష్ణరాయుడుపేట గ్రామాల్లో నూతన పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఎంపిపి డి.సత్యవంతుడు మంజూరు పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచులు లవుడు అరుణ, సిహెచ్.ముసలినాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.కుమారి, గ్రామ నాయకులు పైడిబాబు, ఎంపిపి సతీమణి స్వప్న, ఎల్.శ్రీను పాల్గొన్నారు. వావిలపాడు పంచాయతీలో కడకొండ గ్రామంలో పెరిగిన పింఛన్లను సచివాలయ కన్వీనర్ బీల సతీష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ పాలి ఈశ్వరమ్మ, నాయకులు జి.వెంకటరావు, పాలి దేవుడు, చీపురు దేముడు, ఇరటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సింగరాయి, జగ్గయ్యపేట, అరిగిపాలెం గ్రామాల్లో సర్పంచులు నిరుజోగి వెంకటరావు, వంటాకు శ్రీను, కన్వీనర్ దుల్ల లక్ష్మి, ఎంపిటిసిలు తొండవరపు రమణ, రాయవరపు రాజీవ్, నాయకులు దుల్ల వెంకటరావు పింఛన్లు పంపిణీ చేశారు.

నేడు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ చైర్పన్ సావు వెంకట మురళీకృష్ణ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్, మెప్మా ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పింఛను సొమ్ము రూ.2500 నుంచి రూ.2,750కు పెంచిందని, వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నాయుడుకాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లను కోరారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మాదకద్రవ్యాలు సేవించడం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయని ఎస్ఐ సిఐ ఎస్.ధర్మారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల నష్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలను రవాణా, వినియోగంపై టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎస్ ఎస్.రమ్యశ్రీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-గంట్యాడ

కెజిబివి విద్యార్థులు ఐదుగురు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎ.జ్యోతి తెలిపారు. డిసెంబర్లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో కె.అశ్విని, బి.మేరీగ్రేస్, ఎస్.చాందిని, పి.దీపిక, డి.మహిమ సత్తాచాటి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపల్, పిఇటి పి.భవాని, సిబ్బంది అభినందించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-గంట్యాడ

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని సర్పంచ్ కె.ముత్యాలునాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని కొండతామరపల్లిలో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ సర్పంచ్, కీర్తిశేషులు కోడిలా అప్పలస్వామి నాయుడు, దేవుడమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.20 వేల విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎంపిటిసి ఎర్ర అప్పారావు, వైఎస్ఆర్ యువసేన రాష్ట్ర కార్యదర్శి ఎర్ర చంద్రమ్మ, వైసిపి నాయకులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జెజెఎం పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కెజెపూడి గ్రామ సచివాలయ పరిధిలో జలజీవన్ మిషన్ నిధుల రూ.17.5 లక్షలతో చేపట్టే పనులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి సన్నిధిలో జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - జామి

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని అన్నమరాజుపేటలోని పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయ ఉత్తర ద్వారాన్ని జెడ్‌పి మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆశీర్వచనం చేశారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా రెడ్డి దామోదర్, కె.జగన్నాధం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల గౌరవాధ్యక్షులు మరడ అప్పారావు మాట్లాడుతూ మాజీ సైనిక ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కలిసి పని చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు పరిష్కారానికి ఐక్యంగా పని చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శంభాన సతీష్‌కుమార్, మాజీ ఉపాధ్యక్షులు రెడ్డి అప్పలనాయుడు, టి.సత్యా రావు, తదితరులు పాల్గొన్నారు.



న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఘనంగా న్యూఇయర్ వేడుకలు

ప్రజాశక్తి-వేపాడ

ఎన్ఆర్ఐ, టిడిపి నాయకులు గొంప కృష్ణ కార్యాలయంలో ఆదివారం రాత్రి న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు మహిళా మండల అధ్యక్షులు గుమ్మడి భారతి ఆధ్వర్యాన పార్టీ నాయకులు, కార్యకర్తలకు తరలివెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. సతివాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన లెంక హరినాయుడు అనే పేద విద్యార్థి గత కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. దీంతో అదే పాఠశాలకు చెందిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 35వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సాయాన్ని సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ చేతుల మీదుగా అందజేశారు.

ములగ నర్సరీలు పరిశీలన

వంగర : మండలంలో వివిధ గ్రామాలలో ఉన్న మునగ నర్సరీలను ఏరియా కోఆర్డినేటర్ (ఏసి) ఎ.చిరంజీవి సోమవారం పరిశీలించారు. మండలంలోని తలగాం, కొప్పర, మగ్గూరు, సంగాం, ఎం.సీతారాంపురంతో మొత్తం 11 గ్రామాలలో ములగ నర్సరీలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీటిని ఒక్కో గ్రామానికి 5వేల మొక్కలు చొప్పున మహిళా సమాఖ్య గ్రూపులో ఉన్న ఒక్కో సభ్యునికి ఒక మొక్క రెండు రూపాయలు చొప్పున పంపిణీ చేసేందుకు వీటిని సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సంగాం గ్రామంలో ఓ రైతు పండిస్తున్న చిక్కుడుకాయల పంటను పరిశీలించి ఆ రైతుకు ఎంత ఆదాయం వస్తుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఎపిఎం గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ మదిన లక్ష్మి

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రామ పంచాయతీ అభివృద్ధికి పాలకవర్గం, గ్రామస్తులు సహకరించాలని కంటకాపల్లి సర్పంచ్ మదిన లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలో కంటకాపల్లి, తుమ్మికాపల్లి గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. ఈ సభల్లో మదిన లక్ష్మి, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో రూ.5.50 కోట్లతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిలతో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మదిన అప్పలరాం, బోదల సురేష్‌కుమార్, ఉప సర్పంచ్ బోదల సుధాకర్, ఎస్.ఎన్.పాత్రుడు, మదిన ప్రకాష్, కార్యదర్శులు మాధవి లత, జోగారావు పాల్గొన్నారు.

పూలే విగ్రహావిష్కరణకు తరలిరావాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కలెక్టరేట్ వద్ద మంగళవారం నిర్వహించే సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణకు బిసిలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిసి సంఘం నేతలు ముద్దాడ మధు, ఎస్ వి వి రాజేష్, పిన్నింటి కళావతి కోరారు.

ఎన్‌డబ్ల్యుపిసి షెడ్ల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కుంపల్లిలో ఎన్‌డబ్ల్యుపిసి షెడ్‌ను సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో వేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. దీనివల్ల గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తదని, గ్రామస్తులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కె.కుమారి, ఎల్.శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో ఉత్తమ లాభాలు

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

వ్యవసాయ శాఖ, స్వయం సహాయ సంఘాలద్వారా అంతర పంటల సాగుకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహన్ని అందిస్తామని కలెక్టర్ సూర్యకుమారి పేర్కొన్నారు. ప్రపంచ చిరు ధాన్యాల సంవత్సరంగా ఈ ఏడాది ప్రకటించిన సందర్భంగా సోమవారం స్పందన ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ పంటల చిరుధాన్యాల ప్రదర్శన, పలు రకాల కూర గాయల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మూడో పంట కింద చిరు ధాన్యాల సాగు చేస్తున్నారని, రైతుకు ఇది ఎంతో లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. దేశీయ రకాలకు మార్కెట్‌లో చాలా గిరాకీ ఉందని రైతులు వాటి పై దృష్టి పెట్టాలని అన్నారు. అంతర్ పంటల సాగు వలన రెగ్యులర్ గా వేసే పంటకు ఎలాంటి నష్టం జరగకుండా అదనపు లాభం వస్తుందని అన్నారు. ధరలు మార్కెట్ ధరల కన్నా తక్కువగా ఉండడం తో స్పందనకు విచ్చేసిన కక్షిదారులు , అధికారులు కొనుగోలు చేశారు.

యువకుడు నిజాయితీ

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్డుపై దొరికిన సామగ్రిని ఆన్‌లైన్ డెలివరీ బాయ్‌కు అప్పగించి తన నిజాయితీను నిలబెట్టుకున్నాడు మక్కువ మండలం ఎ.వెంకంపేటకు చెందిన యువకుడు రెడ్డి సాయికృష్ణ. పట్టణంలోని నాయుడుకాలనీ నుంచి సాయికృష్ణ ఇంటికి వెళ్తుండగా గోనెసంచితో ఆన్‌లైన్‌లో బుక్ చేసిన నిత్యావసర సరుకులు రోడ్డుపై పడి ఉండటాన్ని గుర్తించాడు. ఆ సామగ్రిని జనసేన మండల అధ్యక్షులు ఎల్.గంగాధర్‌కు అప్పగించాడు. సామగ్రి పోగొట్టుకున్న వ్యక్తికి ఇవ్వాలని గంగాధర్‌ను కోరడంతో ఆయన బొబ్బిలిలో ఉన్న సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ పోస్టును చూసిన ఆన్‌లైన్ డెలివరీ బాయ్ గంగాధర్‌ను కలిశాడు. మోటార్ సైకిల్‌పై ఆర్డర్ చేసిన సామగ్రిని తీసుకెళ్తుండగా జారిపోయాయని విషయాన్ని తెలియజేశాడు. అనంతరం ఆన్‌లైన్‌లో బుక్ చేసిన యజమానికి సామగ్రిని అప్పగించాడు. యువకుడు సాయికృష్ణ నిజాయితీను పలువురు అభినందించారు.

విద్యార్థులతో ఆటలా?

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థుల జీవితాలతో ప్రజాప్రతినిధులు ఆటలాడవద్దని టిడిపి విజయనగరం పార్లమెంట్ మహిళ ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం, కార్యదర్శి పి.సూర్యకుమారి అన్నారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి నిచ్చారు. మెంటాడ మండలం పెదమేడపల్లిలో గత నెల 28న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ముఖ్యఅతిథిగా హాజరయ్యారని తెలిపారు.ఆయనకు స్వాగతం పలికేందుకు మోడల్ స్కూల్ విద్యార్థినులను సుమారు 2 గంటలకు పైగా సమయం ఎండలో నిలబెట్టడంతో వారంతా ఎండ వేడిమి తాళలేక సొమ్మసిల్లి పడిపోయారని తెలిపారు. ఈవిషయమై జాతీయ మహిళా కమిషన్‌కు తెలిజేశామన్నారు. అధికారులు తగు విచారణ జరిపించి, భవిష్యత్తులో విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేసే ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. వినతినిచ్చినవారిలో మహిళా నాయకులు ప్రసన్న, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు,కంది మురళీనాయుడు, కనకల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు

రెడ్డికపేటలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని డి.కొల్లాం పంచాయితీ రెడ్డికపేట గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో సోమవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు మాట్లాడుతూ వైసిపిని గద్దె దించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కలిదిండి పాణీరాజు, కొర్నాన ఆదిబాబు, మీసాల లక్ష్మి నాయుడు, కలిశెట్టి అప్పలనాయుడు, కారణం రమణ, కలిశెట్టి త్రినాధ్, పిన్నింటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు గంట్యాడ మండలం కొటారుబిల్లి జంక్షన్ వద్ద పింఛన్లు అందజేసే నిమిత్తం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు కలెక్టరేట్ వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణలో పాల్గొంటారు. 4.30 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్లనున్నారు.

అంగన్వాడీ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం రామతీర్థం అంగన్వాడీ కేంద్రం, సచివాలయాన్ని సోమవారం సందర్శించి బాలలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సంధర్భంగా అంగన్వాడీ కేంద్రంను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సమయం ప్రకారం బోజనాలను పిల్లలకు పెట్టాలని నిరంతరం ఎత్తు, బరువు, కొలతలు నిర్వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు, కేంద్రంలో పిల్లలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్త హీనత లేకుండా చూడాలని నీరసంగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి సమతుల్య పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. సచివాలయంలో మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఆరోగ్య కార్యకర్తతో బాలలకు సంబందించిన పలు అంశాలు చర్చించారు.. ప్రతీ సచివాలయ కేంద్రంలో బాలలకు సంబంధిన సంక్షేమ పథకాలు, బాల్య వివాహాలు, బాల కార్మికచట్టాలు, దిశ యాప్, అంశాలకు సంబంధించిన గోడ పత్రికలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యవతి పర్యవేక్షణ అధికారులు శకుంతల, జ్యోతి, పైడితల్లి అమ్మవారి పాలక మండలి సభ్యులు సత్తి అచ్చిరెడ్డి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

జిల్లాలో సోమవారం సంభవించిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. భోగాపురం మండలం రామచంద్రపేటలో క్వారీలో బాంబుపేలి ఓ యువకుడు మృతిచెందాడు. రామభద్రపురంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయుడు మరణించాడు. డెంకాడ మండలం జొన్నాడ సమీపంలో వ్యాను ఢీకొని ఒకరు, మెరకముడిదాం మండలం గర్భాం సమీపంలో లారీ ఢీకొని మరొకరు దుర్మరణం పాలయ్యారు.

ఎదురెదురుగా బైకులు ఢీ

రామభద్రపురం : స్థానిక గ్లోబల్ స్కూల్ సమీపాన జాతీయ రహదారిపై సోమవారం ఎదురెదురుగా బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ సురేంద్ర నాయుడు కథనం ప్రకారం..




మృతిచెందిన జోగయ్య

గ్లోబల్ స్కూల్లో ప్రయివేట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పొగిరి జోగయ్య (37) స్కూల్‌కు వెళ్తున్నారు. బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు ద్విచక్ర వాహనంతో వస్తున్న ఇద్దరు వ్యక్తులు అజాగ్రత్తగా, వేగంగా వచ్చి జోగయ్యను ఢీకొన్నారు. దీంతో జోగయ్య మరణించారు. జోగయ్య స్వగ్రామం బాడంగి మండలం కోడూరు. ఉద్యోగ రీత్యా స్థానికంగా నివాసముంటున్నారు. గాయాలపాలైన యువకులను చికిత్స కోసం, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తర లించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృత్యువాత

డెంకాడ : మండలంలోని జొన్నాడ సమీపంలో 43వ జాతీయ రహదారిపై సోమవారం వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. జొన్నాడ గ్రామానికి చెందిన ఆవాల అప్పన్న (55) గ్రామంలో తన ఇంటి నుంచి రహదారిపైకి వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో రోడ్డు దాటుతుండగా విజయనగరం నుంచి విశాఖపట్నం వెళుతున్న వ్యాన్ బలంగా ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రహదారిపై ఆవాల అప్పన్న మృతదేహం

క్వారీలో బాంబు పేలి యువకుడు మృతి

భోగాపురం : చేతికి అంది వచ్చిన కొడుకును కోల్పోవడంతో ఆ తల్లి రోదన వర్ణతీతం. తండ్రి లేకపోయినప్పటికీ తల్లికి అండగా నిలుస్తూ కుటుంబ పోషణ కోసం క్వారీలో పని చేసుకుంటున్న యువకుడు బాంబు పేలి మృతి చెందిన సంఘటన మండలంలోని రామచంద్ర పేట గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. ఎప్పటి లాగానే పని కోసం వెళ్లి మిగతాజీవుగా మారిన కొడుకును చూసిన ఆ తల్లి రోదన స్థానికులను కలచివేసింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని రామచంద్ర పేట గ్రామాన్ని ఆనుకొని ఉన్న క్వారీలో జరిగిన ప్రమాదంలో కొయ్య గోవింద్ (30), కోటిపల్లి బుల్లోడు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో గోవింద్ మృతి చెందాడు. కోటిపల్లి బుల్లోడు విజయనగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిస్తోంది. ఈ విషయమై ఎస్ఐ కృష్ణమూర్తిని వివరణ కోరగా సంఘటన జరిగిన మాట వాస్తవమేనని, అయితే తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు రావాల్సి ఉందని అన్నారు.

లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

మెరకముడిదాం : మండలంలోని గర్భాం పెట్రోల్ బంక్ వద్ద లారీ బైక్‌ను ఢీ కొనటంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బుధరాయ వలస ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపిన వివరాలు ప్రకారం.. మెరక ముడిదాం గ్రామానికి చెందిన ఎం. రాజేష్ కుమార్ (32) గర్భాం నుండి గరివిడి వైపు వెళుతుండగా, గరివిడి నుండి గర్భాం వస్తున్న లారీ గర్భాం పెట్రోల్ బంక్ వద్ద ఢీ కొట్టడంతో రాజేష్ కుమార్ తలకు బలమైన గాయమై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పడాల్ తెలిపారు.



తలకు తీవ్రగాయమై మరణించిన రాజేష్‌కుమార్

పప్పుల చీటీ ఏజెంట్లపై ఒత్తిడి చేయొద్దు

ప్రజాశక్తి - గుర్ల

పప్పుల చీటి ఏజెంట్లపై సభ్యులు ఒత్తిడి తేవద్దని బొబ్బిలి డిఎస్‌పి మోహనరావు అన్నారు. గుర్ల పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఆయనను సోమవారం పప్పుల చీటి ఏజెంట్లు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గుర్ల మండలానికి చెందిన పతివాడ శ్రీలేఖ, విజయనగరం మండలానికి చెందిన మజ్జి రమేష్ సుమారు 25 వేల మందిని సభ్యులుగా చేర్చి ప్రతి సభ్యుడు నుండి నెలకు రూ.300 చొప్పున వసూలు చేసి పరారైన సంగతి తన దృష్టికి వచ్చిందన్నారు. అప్పలరాజును అదుపులోకి తీసుకొని అతను నుంచి డబ్బులు రికవరీ చేసి భాదితులకు న్యాయం చేస్తామని అప్పటి వరకూ సభ్యులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. నెల్లిమర్ల పారిశ్రామిక వాడలో అప్పలరాజుకు సంబందించిన రెండు వాటర్ ప్లాంటులు ఉన్నట్టు సమాచారం ఉందని, శ్రీలేఖకు సంబందించిన ఆస్తి వివరాలను సేకరించి భాదితులకు న్యాయం చేస్తామన్నారు.

వంగరలో గ్రామసభ

ప్రజాశక్తి - వంగర

వంగర సర్పంచ్ కనగల భారతి అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన మరుగునీటి కాలువలు, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాలపై చర్చించారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు. అనంతరం పలువురికి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపిటిసి కనగల పద్మ, పారినాయుడు, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు కాంబోతుల భగవతమ్మ, దేవకివాడ దుర్గ అప్పలనాయుడు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 190/2019 O.S.356/2018

Between :
Yadama Subrahmanyeswara Rao ...DHR
And:
Netheti Venkata Ramana @ Ramana ....JDR

To
Netheti Venkata Ramana @ Ramana S/o Ramunaidu, Raja Street, Gajularega, Vizianagaram.

పై నెంబరు అమలులో మీకు అనేకసార్లు పై కోర్టువారి నుండి నోటీసులు పంపినా మీరు తీసుకోనందున పై తెల్పిన అమలు మీకు నోటీసు నిమిత్తం **తే 30-1-2023దీ**కి వాయిదా వేసిరి. కావున పై అమలులో మీకు ఆక్షేపణలున్న ఎడల **తే 30-1-2023దీన ఉదయం 10-30 గం॥**లకు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో పై అమలు మీ పరోక్షమందు తీరానించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Petitioner
Vizianagaram-2,
Cell No.9441053628

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, VIZIANAGARAM
I.P. 20/2022

Between:
Amara Srirama Koteswara Rao, S/o Late Rama Murthy, Penubarthi (v), Gurla (m) ....Petitioner
And
01. Relli Pydi Naidu, S/o Late Tata, Geddapuvalsa (PO), Garividi (M),
02. Routhu Bangaru Naidu, Duvvam (v), Garividi (M),
03. Kondapalli Sanyasi Naidu @ Pandujuttu Naidu, Kondapelem, Garividi (M),
04. Vadapalli Nageswara Rao, S/o Late Narayana Rao, Patha Garividi, Vizianagaram
05. Reddy Satyam, Kondapalem (PO), Garividi (M),
06. Seemakurthi Venkata Raju, S/o Late Manga Raju, Garividi
07. Tiruvudi Tirupathi Rao, Garividi
08. Potti Ramu Naidu, Kondapalem, Garividi (M),
09. Kolati Sankara Rao, S/o Late Appa Rao, Thondrangi, Garividi (M),
10. Botla Venkata Ramana, S/o Late Mallikarjuna Rao, Pedanadipalli, Cheepurupalli (M),
11. Smt. Botla Sudha Rani, W/o Venkata Ramana, rest -do-.
12. Yajjiparapu Satyam Master, Dummeda, Garividi (M),
13. Challa Jagadeesh, Garividi,
14. D.Nanalu, S/o Late Appalanarasayya, Garividi.
15. Sabbisetty Venkatesh, Bairipuram, Merakamudidam (m),
16. Suru Ramanayya, Cheepurupalli (m),
17. Suru Srinivasa Rao, S/o Late Ranganayakulu, rest -do-
18. Subuddi Lakshamana Rao, Cheepurupalli,
19. Nagesh, Cheepurupalli (m)
20. Kadagala Rama Rao, Cheepurupalli
21. Srirama Murthy, Cheepurupalli
22. Andavarapu Venkata Ramana, S/o Satyam, Cheepurupalli
23. M.Surapu Naidu, cheepurupalli
24. P.Lakshmana Rao, Cheepurupalli
25. Muppidi Sankara Rao, Garividi
26. Sri Lakshmi Srinivasa Modern Rice Mill, Vadisaleru, East Godawari Dist.
27. Sree Murali Mohna Boiled & Raw Rice Mill Pvt. Ltd., Komaripalem, East Godawari Dist
28. Sri Lalitha Enterprises India Pvt. Ltd., Peddapuram, East Godawari Dist.
29. Sri Shirdi Sairam Rice Mill, Vedurumudi, East Godawari Dist.
30. Sati Rami Reddy, Proprietor, Veerabhadreswara Raw & Boiled Rice Mill, Polamuru, East Godawari Dist.
31. Sri Balaji Boild & Raw Rice Mill, Ravaram Vil, East Godawari Dist.
32. Sri Siva Sankara Rice Mill, S.No.209/2, B.Prathipadu, East Godawari Dist.
33. Vaddadi Viseswara Rao, S/o Late Venkata Rao, Cheepurupalli.

GENERAL NOTICE

The petitioner filed the above IP for declaration of insolvency as he became indigent for discharge of debts contracted by him with the creditors 33 in number.

The Honourable Court has been pleased to order the general notice to whom so ever it may concern to appear either in person or through an Advocate on **23.01.2013 at 10:30 am** for raising objections if any in the above matter otherwise, the matter will be heard ex-parte.

Vizianagaram,
Date 26.12.2022

K.SRIHARI SARMA
Advocate Vizianagaram
Cell: 9441749034